
# తరంగాలు

దాసరి శిరీష



**అబ్బా! ఇంకా రాదేం ఈ ఊరు! బాధగా కణతలు రుద్దుకుంటూ అటూ ఇటూ చూశాడు హేమంత్. మధ్యాహ్నపు గాలి గ్లాస్ కిటికీలోంచి వెచ్చగా మొహానికి కొట్టింది. తనలాగే ఆదుర్దాగా చెట్లూ, పొలాలు, నీటి మడుగులూ పరిగెత్తుతున్నాయి అనుకుంటూ వేగంగా డ్రైవ్ చేస్తున్నాడు.**

అమ్మ...అమ్మా... ఎలా వుందో? ఏం చూడాల్సి వస్తుందో? డాక్టరు మిత్రుడు అబద్ధం చెప్పాడా? తను చేరే సరికి ఇంటి ముందు... లేదా నిరంజన్ హాస్పిటల్ ముందు.... ఛా... ఛా... పాడు ఆలోచనలు... ఏమిటిలా? కళ్ల నీళ్లు ఆపుకుంటూ స్టీరింగ్ పక్కకి తిప్పాడు. గేదెల మంద తాపీగా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

ఊళ్లోకి ప్రవేశించగానే గుండె దడ మొదలయింది. తమ ఇల్లు దాటే హాస్పిటల్‌కు వెళ్లాలి. ఇల్లు... హమ్మయ్య ఫర్వాలేదు. హాస్పిటల్... ఏ హడావుడి లేదు. కారు దిగి లోపలికి పరిగెత్తాడు. నిరంజన్ ఎదురుగా వస్తున్నాడు.

నిరంజన్.... హేమంత్ జీరగా అన్నాడు.

''ఛా... ఛా... ఏమీ కంగారు లేదు. అమ్మ బాగానే వుంది. గండం గడిచింది. రా అదిగో ఆ రూమే.''

సెలైన్ ఎక్కుతూ వుంది. నీరసంగా, నిర్వికారంగా కళ్లు మూసుకొని వుంది జయమ్మ. వీళ్లిద్దర్నీ చూసి సిస్టర్స్ లేచి నిలబడ్డారు. వేదనా... ఆందోళనా... నిరంజన్ వివరిస్తుంటే నిర్ఘాంతపోతూ 'మేము వెళ్లి నాలుగు రోజులు కూడా అవలేదుగా? నిరంజన్' అన్నాడు.

''ఒక్క క్షణం చాలు హేమా అంతా తారు మారు కావడానికి బాధపడకు'' స్నేహితుడి భుజం చుట్టూ చేతులు వేసి తన కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చోబెట్టాడు. కాఫీ సిప్ చేస్తూ నిరంజన్ చెప్పింది వింటూ ఉలిక్కిపడ్డాడు. నిజమా అన్నాడు వణుకుతున్న కంఠంతో.

''నిజం సిస్టర్ లలిత అమ్మనడిగి తోటకూర కోసుకుందామని వెళ్లిందట. పక్క రూమ్‌లో దంపతులూ ఊరెళ్లారు. లలిత అనుకోకుండా వెళ్లడం వల్లే మనం అమ్మని మళ్లీ...''


''ఇంకా ఆనాటి అక్కనీ...నాన్ననీ మర్చిపోలేదు ఎవరం నిరంజన్. నాన్న సంవత్సరీకం కాగా కిందటి వారం అందరం వచ్చాం.

ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా దీర్ఘంగా నిట్టూర్చి హేమంత్ చేయి ఓదార్పుగా నొక్కాడు నిరంజన్. పద ఇంటికెళ్లి స్నానం అదీ చేసి... మళ్లీ అవన్నీ గుర్తుచేసుకోకు.

''ఊహూ... నేను మా ఇంటికెళ్లి వెంటనే వస్తాను.'' మరొకసారి జయమ్మని చూసి ఆత్రంగా ఇంటికి చేరాడు. వయ్యారంగా ఊగుతున్న చెట్లూ.... ఇంటి ముందు పూల మొక్కలూ... ఎందుకో అవన్నీ చూస్తుంటే చాలా నిశ్చింతగా అనిపించింది హేమంత్‌కి. ఫర్వాలేదు. వీటిలాగానే అమ్మ కూడా మళ్లీ కళకళలాడుతుంది. నాలుగు వైపులా కలియచూస్తూ అనుకున్నాడు. అదిగో ఆ మూల గేదె, చిన్నపాక వుండేవి. ఏనాడో ఈ స్థలం తీసుకొని ముందుగా తడికెల ఇల్లు వేసుకున్నారు తల్లిదండ్రులు. ఇద్దరూ టీచర్లు. ఈ చుట్టుపక్కల గ్రామాల్లోనే పనిచేశారు. పొల గురించి గేదెనీ,

## సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి కథల పోటీ

### సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ



కోళ్లనీ పెంచుతూ బడి దగ్గర్నుంచి వచ్చాక గూడా అమ్మా,నాన్న ఏదో ఒక పనిలో వుండేవారు. తడికలు తీసి క్రమంగా గోడలు కడుతూ వచ్చారు.

ఎన్ని జ్ఞాపకాలో ఈ ఇంటితో. ఈ ఇంటికి ఒక ఆకారం తీసుకురావడానికి ఎంతో కష్టపడ్డారిద్దరూ. అదిగో ఆ వేప చెట్టు దగ్గర ఎప్పుడు అక్క సుచిత్ర పాఠాలు చదువుకుంటూ వుండేది. ఆటలాడేది. తనకీ, తమ్ముడికీ స్నానాలు చేయించి తల దువ్వేది. సుచిత్రక్క ఎంత చిత్రంగా మాయమయ్యావు..? స్నానం చేసి హాల్లోకి వచ్చాడు. నాన్న పడక్కుర్చీ అలాగే వుంది. ఆ గదుల్లో.... వస్తువుల్లో ఏమార్పూ లేదు. ప్రతి సంవత్సరం కుటుంబాలతో సహా నాన్న సంవత్సరీకానికి తామంతా వస్తూనే వున్నారు. రావడం... కేవలం రెండు రోజులుండి మళ్లీ తిరుగు ప్రయాణం హడావుడి ఇంత తీరిగ్గా జ్ఞాపకాల్లోకి ఎప్పుడెళ్లాడు తను... హయ్యో.... నాన్నా... నాన్నా ఎక్కడికెళ్లిపోయావు?

ఫోన్ మోగింది. భార్య రత్న వేసిన ప్రశ్నలకి సమాధానం చెప్పి మళ్లీ పడక్కుర్చీ వైపు చూశాడు. నాన్న కుర్చీ చుట్టూ పత్రికలూ, పేపర్లు వేసుకొని వుండేవారు. తన పెళ్లయిన కొత్తల్లో ''నాన్నా మీరిద్దరూ హైదరాబాద్ వచ్చేయండి ఇక్కడొద్దు'' అన్నాడు విచారంగా.

''వస్తూనే వున్నాం కదా బుజ్జీ''

''అలా కాదు పూర్తిగా వచ్చేయాలి'' తన మాటలకు నాన్న నవ్వారు.

''అమ్మింకా సర్వీసులోనే వుంది గదురా నాన్నా..''

''లాంగ్ లీవ్ పెడుతుంది వచ్చేయండి''


''చూద్దాంలే నాన్నా''ప్రేమగా భుజం తట్టారు. ఆ తర్వాత రెండేళ్లకే సుచిత్ర పోయిందని వార్త. అక్క డిగ్రీ సెకండియర్‌లో వుండగానే మంచి సంబంధం వచ్చిందని, కట్నకానుకలు పుచ్చుకోరనీ, పిల్ల నచ్చితే చాలని నాన్న స్నేహితుడు ఏదో సంబంధం తీసుకొచ్చారు. సుచిత్ర నచ్చడం, వెంటనే పెళ్లి. ఇంజినీరయిన భర్తతో కేరళ వెళ్లిపోవడం చాలా త్వరగా జరిగిపోయాయి. తనకన్నా అక్క రెండేళ్లే పెద్ద. సంవత్సరానికోసారి భర్తతో కలిసి వస్తూండేది.

తనేమిటలా నిలబడిపోయాడు? ఈ పెద్ద హాల్లో ఎవరెవరివో ఫోటోలు. శ్రద్ధగా ఫ్రేములు కట్టించి తగిలించారు. వాళ్లంతా అందమైన గతానికి సాక్షులు. మనుషులింత గొప్పగా సజీవస్మృతు లవుతారా? అసలు ఇంత తీరిగ్గా తను హైదరాబాద్‌లో ఆలోచిస్తాడా?... తనో ప్రముఖ సంస్థలో ఇంజనీర్... తమ్ముడో శాస్త్రజ్ఞుడు. సమయానికి బందీలు. అయినా ఎక్కడో జీవితంలో సహజమైన లింకులు తెగిపోయాయి. ఎలా అతికించుకోవాలో తెలియనంత అయోమయంగా తయారయ్యారు తమలాంటివాళ్లు.

వంటగదిలోకి నడిచాడు హేమంత్. ఉన్నంతలో అన్నీ సౌకర్యాలు అమర్చుకుంది అమ్మ. కొత్త వాళ్లొచ్చినా వెంటనే చక్కగా వంట చేసుకోగలిగినంత పద్ధతిగా, చక్కగా సర్దుకుంది అమ్మ. కళ్లు చెమర్చాయి. అమ్మ హాస్పిటల్‌లో వుంది. అమ్మకి సంబంధించిన పరిసరాలతో, వస్తువులతో మౌనంగా తను సంభాషిస్తున్నాడు చిత్రం.

ఫోన్ మళ్లీ మోగింది. నిరంజన్ భోజనానికి రా అంటున్నాడు. అవును వెళ్లాలి. అమ్మ దగ్గరే చాలా సేపు వుండాలి. అన్ని గదులూ ఒకసారి చూసుకొని తాళం వేసి బయటకు నడిచాడు. ఆ రోడ్డు చివరి మలుపు చూస్తుంటే తాతయ్య గుర్తుకొస్తున్నాడు. మౌనంగా నడుస్తూనో, లేదా పద్యాలు పాడు కుంటూనో, ఓపిగ్గా డ్రామాలకి వెళుతూనో కొంత కాలం ఈ ఊర్లో గడిపి మామయ్యల దగ్గరకి వెళ్లిపోయేవారు.

హాస్పిటల్‌కి వెళ్లే దారిలో ఎంతో మంది పలకరింపులు. అమ్మకి బాగా లేదా? అయ్యో అస్సలు తెలియదయ్యా మాకు.... అనే విచారపు మాటలు... మెల్లగా నడుచుకుంటూ హాస్పిటల్‌కి వెళ్లాడు నిరంజన్. అమ్మ బెడ్ దగ్గరే వున్నాడు. అమ్మ కళ్లు తెరచి చూస్తోంది. తనని చూసి దిగులుగా నవ్వింది. నిరంజన్ తేలిగ్గా ఊపిరి పీల్చి మళ్లీ వస్తానని సైగ చేసి వెళ్లిపోయాడు. హేమంత్ నవ్వు మొహంతో జయమ్మ చేతిని పట్టుకొని నిమురుతూ ఆ స్పర్శతోనే ఆమెతో సంభాషణ మొదలుపెట్టాడు. ఆమె కొంచెం. నిశ్చింతగా, వ్యధాపూరితంగా కొడుకుని చూస్తోంది. ఆ సున్నితమైన స్పర్శ ఎన్నో సందేశాలు పంపుతోంది. మొత్తం కుటుంబ నేపథ్యాన్ని, గడిచిన రోజులనీ పదే పదే గుర్తుచేస్తోంది.




అలా మూగగా.... మౌనంగా కాలం నడిచింది.

ఓ గంట అలా కూర్చున్నాక నిరంజన్‌తో కలిసి వాళ్లింటికి భోజనానికి వెళ్లాడు. చిన్ననాటి స్నేహితుడు, దాదాపు కుటుంబంలోని వాడు ఈ డాక్టరు. ఈ నిరంజన్... ఇంత బాధ్యతగా.... ఆత్మీయంగా అమ్మని చూసుకోవడం తామందరి అదృష్టం. నాన్నకి కూడా నిరంజన్ అంటే ఎంతో ఇష్టం కదూ! ఇంద్రాణి నిరంజన్ భార్య. పరామర్శిస్తూ వడ్డిస్తోంది. పిల్లలు కాస్సేపు మాట్లాడి వెళ్లిపోయారు. కొసరి కొసరి ఆమె వడ్డిస్తుంటే ఎందుకో ఆకలిగా అనిపించడం లేదు హేమంత్‌కి. ఊళ్లో చాలా మంది గురించి అడుగుతూ భోజనం ముగించాడు. వక్కపొడి నములుతూ ఇద్దరూ చల్లగాలి కోసం అన్నట్లు నడవడం ప్రారంభించారు.

మీరు సంవత్సరీకానికి వచ్చినప్పుడు నేను లేను హేమంత్. అసలేం జరిగింది? నిరంజన్ సందేహంగా చూశాడు.

అవునూ... అసలేం జరిగిందంటే... ఐదేళ్ల క్రితం నాన్నని కిషోర్ తమాషాగా ఏదో అడిగాడు. అప్పటి నుంచి తమలో ఇంకో రకమైన మనుషులు పుట్టుకొచ్చారు. కిషోర్ వేసిన ప్రశ్నకి ఆరోజుల్లో నాన్న చిన్నతనపు చేష్టగా భావించి వదిలేశారు. అసలు వాడేం అన్నాడు? స్వగతంలా చెప్పుకుంటూ అవే మాటలు నిరంజన్‌కి చెప్పడం ప్రారంభించాడు.

''నీకు మేమెవ్వరమూ కొత్త కాదు నిరంజన్. ఆరోజుల్లో కిషోర్ నాన్నని 'స్థలం ఎవరి పేరు మీద వుంది నాన్నా' అన్నాడు. నాన్న నవ్వి, 'చిన్నా ఎందుకురా నీకు?' అన్నారు.

''ఆహా... అది కాదు. మరీ... ఊరికే తెలుసుకుందామని''

''కొత్తగా ఈ విజ్ఞానం ఎప్పుడు నేర్చుకున్నావు?'' మళ్లీ నవ్వారు.

అది కాదు ఊరికే తెలుసుకుందామని.... తడబడ్డాడు కిషోర్.

''చిన్నా, ఈ ఇల్లు మనందరికీ సంబంధించిన అమూల్యమైన బంధం. ఇందులో ప్రతి ఇటుకలో... ప్రతి మొక్కలో.... మట్టిలో మనమందరం వున్నాం. మీ నలుగురూ ఎన్నో మొక్కలు నాటారు. పెంచారు....'' ఆయన గొంతు రుద్దమయింది.

అప్పటికీ తాత్కాలికంగా తమ్ముడు తలదించుకున్నా... తర్వాత సంవత్సరం తన ఉద్దేశం బయటపెట్టాడు. ఈ ఇల్లు అమ్మగా వచ్చిన

డబ్బులతో హైదరాబాద్‌లో తల్లిదండ్రుల పేరిట ప్లాట్లు కొంటే భవిష్యత్‌లో రాబోయే లాభాల పంట గురించి వివరించాడు. తనూ, చెల్లి పక్కనే వుండి అవునన్నట్లు తలూపారు. నాన్న వింతగా అందరివైపూ చూసి,''నాతో అంటే అన్నారు. పొరపాటుగానైనా మీ అమ్మతో ఈ మాటలనకండి. ఈ ఊరు.. ఊళ్లో మనుషులూ... ఈ ఇల్లు... మనకి మంచి జీవితాన్నిచ్చాయి. మీకు అందమైన భవిష్యత్తునిచ్చాయి. ఇంకెప్పుడూ ఇటువంటి ప్రస్తావన తేకండి''నిక్కచ్చిగా చెప్పారు. తామిద్దరూ భార్యలతో చివాట్లు తిన్నారు. చాలా కాలం వారి నిరసన వ్రతాన్ని భరించారు. హేమంత్‌లో ఏదో కదలిక ప్రారంభమయింది. అందుకే తండ్రి గురించి అపరాధ భావం ఏదో చోటుచేసుకోవడంలో ఇవన్నీ మాట్లాడుతున్నాడు. నిరంజన్ సానుభూతిగా వింటున్నాడు.

చాలా మాట్లాడేనేమో అనుకుంటూ సిగ్గుపడ్డాడు హేమంత్. దూరంగా రైలు కూత వినిపించింది. వంతెన దిగి వస్తున్న సైకిళ్ల శబ్దాలూ... రిక్షాగంటల చప్పుళ్లు... నువ్వీ ఊరి వాడివే సుమా అని హెచ్చరిస్తున్నట్టుగా వున్నాయి.

తనకి కావలసిన సమాధానం రాలేదు. నిరంజన్ నిలబడి మిత్రుడికి చేయందించాడు. మానవ సంబంధాలు దశలవారీగా ఎంత విచిత్రంగా మారిపోతాయి? తనని చాలా ప్రభావితం చేసిన రమణయ్య మాస్టారు ఈ హేమంత్ తండ్రిని జ్ఞాపకం చేసుకుంటూ నడిచాడు. అతని జ్ఞాపకాలు వేరు.

* * *

పొద్దున్నే చెల్లి రాగిణి దిగింది. ముందే నిరంజన్, హేమంత్ హెచ్చరించడంతో కన్నీళ్లు ఆపుకొని తల్లితో మాట్లాడింది. తన పక్కనే అటూ ఇటూ నిలబడ్డ పిల్లల్ని చూడగానే చిత్రమైన వెలుగొచ్చింది జయమ్మ మొహంలో. నీరసంగానే సంతృప్తిగా కబుర్లు చెబుతోంది. ఇంటికి వెళ్లిపోదాం అని మొదలు పెట్టింది. నిరంజన్ నచ్చ జెప్పడంతో ఊరుకుంది. ఓ రెండు గంటల తర్వాత అన్నా చెల్లెళ్లు ఇంటికెళ్లారు. తలుపులు తెరవగానే దుఃఖం ముంచుకొచ్చింది ఇద్దరికీ. ''అన్నయ్యా వెళ్లే ముందు అందరం అమ్మని బాగా ఏడిపించాం కదూ. మా ఆయనకి కూడా ఈ మధ్య స్థలాల పిచ్చి బాగా పట్టుకొంది'' సంజాయిషీగా అంది.

''చిన్నప్పుడు తల్లిదండ్రుల పెంపకం, మంచి వయస్సులో మన భాగస్వాముల ప్రభావం .... తప్పదురా.... ఇదో ప్రవాహం. కిందటి వారం తండ్రి సంవత్సరీకానికి ముగ్గురూ కుటుంబాలతో వచ్చారు. ఎప్పటిలాగే జయమ్మ దగ్గర బంధువుల సహాయంతో బాగా నిర్వహించింది. ముగ్గురూ కాస్సేపు ముచ్చటించుకున్నాక ఆ మర్నాడు జయమ్మని కదిపారు. రాగిణి అమ్మ ఫొటోని, తండ్రి ఫొటోను చూసుకుంటూ ఆ రోజు విషయాలు గుర్తు చేసుకుంది.

అన్న హేమంత్ గొంతు సవరించుకున్నాడు.

'అమ్మా ఇప్పుడు భూమిరేట్లు విపరీతంగా పెరిగాయి. మన ఊరు సిటీకి దగ్గరవడంతో బాగా ధర పెరిగింది.''

''అవున్నాన్నా ఆరోజుల్లో ఇంత పెద్ద స్థలం చాలా చవగ్గా కొన్నాం. అమ్మో ఇప్పుడయితే...''

''మన మెయిన్ రోడ్డు మీద అపార్ట్‌మెంట్స్ వచ్చేస్తున్నాయి. ఇక్కడయినా తీసుకోవచ్చు. లేదా హైదరాబాద్‌లో అయితే... అస్సలు నువ్వు ఊహించలేవు''

జయమ్మకి ఏం సమాధానం చెప్పాలో తెలియక అలాగా అన్నట్లు తలపంకించింది.

కిషోర్ భార్య మోచేత్తో హెచ్చరించడంతో అందుకున్నాడు. ''అవునమ్మా, నీకూ దెబ్బయి దగ్గరపడుతున్నాయి. మా అందరి జీవితాలూ ఆ సిటీతో ముడివడిపోయాయి. మేమంతా అక్కడున్నప్పుడు నువ్వొక్కదానివే ఇక్కడ...''

అవునత్తయ్యా అతని భార్య శీలా వినయంగా అంది. ''మీరు జీవితమంతా శ్రమపడ్డారు. ఇప్పుడు మాతో దర్జాగా చేయించుకోవాల్సిన సమయం ఇది''

ఆమె నవ్వింది. ఆ నవ్వులో మొత్తం ఆమె జీవితానుభవం ఇమిడిపోయింది. ''నాకీ ఊరు, మనుషులూ.. ఎవరూ కొత్తగాదమ్మా. పిలిస్తే పలుకుతారు. పైగా పక్క ఆ చిన్న వాటాలో ఎవరో ఒకరు తోడుగా అద్దెకుంటూనే వుంటారాయే''

శీలాకి ఓపిక నశించింది. రాగిణి ఏదో అనబోయి వదిన్ని చూసి ఆగిపోయింది. హేమంత్ భార్య రత్న వినోదంగా, అక్కసుగా చూస్తోంది. పరిస్థితి అదుపు తప్పుతుందేమోనని భయపడి రాగిణి, ''అవునమ్మా, ఈ ఇల్లు అమ్మి నీ పేరుతో బ్యాంకులో డిపాజిట్టు చేద్దాం'' అంది తెలివిగా.

అప్పుడు.. అప్పుడు.... అమ్మ నిర్ఘాంతపోతూ అందరివైపూ చూసింది. రాగిణికి ఆ దృశ్యం గుర్తుకొచ్చింది.

జయమ్మ పేలవంగా నవ్వింది. శీలా నిర్మొహమాటంగా అంది. అందరికీ ఇళ్లున్నాయి. మాకే లేదు. మాకేమయినా మీరిస్తే మా వాళ్లిచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుంటాం.

జయమ్మ కాస్సేపటి వరకూ మాట్లాడలేదు. ప్రయాణమవుతున్న వాళ్లందరి కోసం ఏవేవో పచ్చళ్లు, పిండివంటలూ మూటలు కడుతోంది. అటూ ఇటూ తిరుగుతోంది.

''ఆలోచించండత్తయ్యా'' ఈసారి రత్న అంది. హేమంత్ ఏదో అనబోయి ఊరుకున్నాడు. తన భర్త గోపీ అందరికీ వత్తాసు పలికాడు. అందరూ దాదాపుగా ప్రయాణానికి సిద్ధపడి ఆమేం చెబుతుందోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

అమ్మా, మీరంతా నా దగ్గర లేకపోయినా ఈ చెట్టూ చేమల్లో మీ అందరినీ చూసుకుంటూ బతుకుతున్నాను. హటాత్తుగా ప్రమాదంలో మరణించిన మీ అక్కని మరిపించడానికి మీ నాన్న తన దుఃఖాన్ని దిగమింగి నాకు కొండంత అండగా నిలబడ్డారు. ఆ ఇద్దరి తర్వాత మీ ముగ్గురూ నా ప్రాణమయ్యారు. ఈ ఇంటివల్లే మనం పైకొచ్చాం. మీరెంతో... నాకీ ఇల్లూ, ఊరు అంతే.


అందరి మొహాల్లో రంగులు మారాయి. ''అయితే ఏమంటారు?'' విసురుగా అంది శీలా.


''నువ్వు మా గురించి ఆలోచించడం లేదమ్మా'' కిషోర్ చిరాకుపడ్డాడు.

''చిన్నోడా, మీకేం తక్కువ నాయినా! ఎంతో భవిష్యత్ ఉన్నవాళ్లు. అసలు ఇల్లు అమ్మాలి అనే భావన మీ మనస్సుల్లో రానే రాకూడదు.'' కటువుగా అంది. అయితే అందరూ కలగా పులగంగా ఏదేదో చర్చించుకున్నారు. వ్యంగ్యంగా కోడళ్లు తర్కించారు. నిబ్బరంగా అందరికీ వీడ్కోలిచ్చింది.

''రాగిణీ రామయ్య తాత వంకాయలు ఇచ్చాడ్రా, ఇవిగో పాలు'' హేమంత్ సంబరంగా వంటగదిలో పెట్టాడు.

ఆలోచనల నుంచి తేరుకున్న రాగిణి చకచకా అన్ని పనులు పూర్తి చేసి అన్నతో కలిసి హాస్పిటల్‌కి బయల్దేరింది. ఆ మర్నాడు పిల్లల పరీక్షలు జరుగుతున్నాయని, మళ్లీ వస్తానని ఇద్దరికీ చెప్పి





## నాగ్ కొత్త సినిమా....

లవర్ బాయ్, యాక్షన్, మాస్ చిత్రాలలోనే కాదు అన్నమయ్య, శ్రీరామదాసు లాంటి భక్తిరస చిత్రాలలో కూడా ప్రేక్షకులను మెప్పించిన అక్కినేని నాగార్జున ఓ సరికొత్త గెటప్‌లో అభిమానులకు కనువిందు చేయనున్నారు. అడవిబాపిరాజు నవల 'గోన గన్నా రెడ్డి'ఆధారంగా నిర్మితమవుతున్న చిత్రంలో నాగ్ హీరోగా నటిస్తున్నారు. చారిత్రాత్మకమైన కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి గుణశేఖర్ దర్శకత్వం వహించనున్నారు.

రాగిణి వెళ్ళిపోయింది. ఇంటికెడదాం అని జయమ్మ గోల పెట్టినా నిరంజన్ హేమంత్‌లు ఆమెని అనునయించారు. ఇంటికీ, ఆఫీసుకీ ఫోన్ చేసి తనింకా రావడానికి ఆలస్యమవుతుందని చెప్పాడు. నేనూ, షీలా బయల్దేరి రామా అని రత్న అంది. అవసరమయితే చెబుతాలే. అమ్మ బాగానే కోలుకుంటోంది అని అన్నాడు. ఒక్కసారి అత్తయ్యని ఆ విషయం...

''రత్నా ఇప్పుడటువంటివి ఏమీ ఎత్తకు'' కోపంగా ఫోన్ పెట్టేశాడు.

తన రూమ్‌లో సెల్‌లో హేమంత్ మాట్లాడుతున్న తీరు గమనించి నిరంజన్ నిట్టూర్చాడు. ఎంతో ఉన్నతమయినది అనుకున్న మాష్టారి కుటుంబం మీద కూడా ఈ ఆర్థిక క్రీనీడలు తప్పడం లేదా? రాగిణితో కిందటి వారం ఏం జరిగిందో చెప్పించుకొని విన్న నిరంజన్ మనస్సులో మథనం ప్రారంభమయింది.

ఎవరూ కఠినాత్ములు కారు. అయినా సాంఘిక వ్యవస్థ స్వార్థపూరితంగా, మానవ సంబంధాల మీద వేటు వేస్తోంది.

కర్చీఫ్‌తో చెమట అద్దుకుంటున్న హేమంత్‌ని చూస్తూ ''మరీ అంత టెన్షన్ పడొద్దు'' అన్నాడు నవ్వుతూ.

''నేనింకా ఎన్నిరోజులూ...?''

''ఉండు హేమా. ఒక నెలవరకూ ఒకరి తర్వాత ఒకరు... ఎవరో ఒకరు ఆమెతో ఉండండి.'' నిరంజన్ మాటలకి సరే అన్నట్లుగా తలూపాడు. 'హేమా చూశావా? మీతో మాట్లాడుతున్నప్పుడు ఈ కుటుంబాల బరువుతో రాకుండా కేవలం ఆమె పిల్లలుగానే మీరు మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఎంత నిశ్చింత.. వెలుగు... చిత్రమైన మెరుపు'

''ఏయ్ నిరంజన్, నువ్వు అందరికన్నా పెద్ద సైకాలజిస్టువి అయ్యావే'' సరదాగా నవ్వేడు.

ఆ సాయంత్రం మళ్ళీ ఇద్దరూ కాలువ ఒడ్డుకి షికారుకి వెళ్లారు. మట్టిబెడ్డలు నీళ్లల్లో విసురుతూ.... దూరంగా వంతెనని చూసుకుంటూ... చిన్నప్పటి స్నేహితుల గురించి ముచ్చటించుకున్నారు. తనకన్నా మూడేళ్ళ సీనియర్ అయిన నిరంజన్ అంటే ఎంతో గౌరవం హేమంత్‌కి. నిరంజన్ ఏదో అనబోయి మళ్ళీ ఊరుకున్నాడు.

''నా దగ్గర సంకోచం ఏమిటి? చెప్పు''అంటూ హేమంత్ బలవంతం చేశాడు.

నిరంజన్ జేబులోంచి రెండు కాగితాలు తీశాడు. ఒకటి బాగా నలిగింది. రెండవ కాగితం మడత సాఫీగా వుంది. చనువుగా అందుకున్నాడు.

''ప్రియమైన నా పిల్లలకీ,

''మీ అందరినీ చాలా బాధపెడుతున్నానని బాగా అర్థమైంది. చిన్నోడు కోపంగా ఫోన్ చేశాడు. కేవలం ఈ ఇంటి వల్ల మన అనుబంధానికి విఘాతం రాకూడదు నాన్నా... మీ ఆటపాటలు.... తీపిజ్ఞాపకాలూ భౌతికంగా మనల్ని వదిలినా మరపురాని మీ అక్క బంధం... మీ నాన్న.... వీళ్లందరి స్థానం ఇక్కడే. అందుకే ఇంత తాపత్రయంతో కాపాడుకోవడం. అయినా మీ కన్నా ఏదీ ఎక్కువ కాదు శెలవు మరి...''

ధారాపాతంగా కారే కన్నీళ్లు తుడుచుకోకుండానే ఇంకో చీటి తెరిచాడు. నిరంజన్ తన భావాలు కనబడనీయకుండా అటువైపు తిరిగాడు.

నా ప్రియమైన నిరంజన్...

నువ్వింకా చదువుతూనే వున్నావు. మీ మామయ్య సహాయంతో చదువుకుంటున్నావు. మా అమ్మానాన్న చాలా మంచివాళ్లే గానీ... కులాలు దాటిన మన ప్రేమని అర్థం చేసుకునే శక్తి లేదు వాళ్లకి. అయినా నువ్వింకా చిన్నవాడివి. మన ప్రేమ మా వాళ్లకి వివరించే సమయం రాక ముందే ఈ పెళ్లి నిశ్చయం చేశారు. నా డిగ్రీ తర్వాత వాళ్లే పూర్తి చేయిస్తారుట. నువ్వు మంచి డాక్టరువయి మన ఊరికీ... చుట్టు పక్కల గ్రామాలకీ మంచి సేవలందించాలి. ఈ ఉత్తరం నీ కందేసరికి నా పెళ్లయి కేరళ వెళ్లిపోవడానికి సిద్ధంగా వుంటా. ఎక్కడున్నా నువ్వు నా మనిషివే.

నీ ప్రియమైన సుచీ....

నిరంజన్...ఉద్విగ్నంగా హేమంత్ అతని చేయి పట్టుకున్నాడు.

నిరంజన్ వేదాంతిలా నవ్వాడు. 'చూడు ఈ అనుబంధాలు ఎంత చిత్రంగా వుంటాయో. ఈ ఉత్తరమే నా గమ్యాన్ని నిర్దేశించింది. ఆ తొలిప్రేమ కరుణాంత రంగుడిగా తయారు చేసింది. ఆమె మరణం నన్నొక వేదాంతిలా మార్చింది' ఆగాడు. అమ్మ రెస్టిల్ టాబ్లెట్స్‌ని...

హేమంత్ సిగ్గుగా తలదించుకున్నాడు. నిరంజన్ అనునయంగా అన్నాడు. అమ్మ ఆత్మహత్యకు ప్రయత్నించిందని తెలుసు. రెస్టిల్ టాబ్లెట్స్ ఏమంత తీవ్రంగా పనిచేయకపోవడమే మనకి ఆమె దక్కేలా చేసింది. కారణం ఊళ్లో కూడా ఎవరికీ తెలియదు. నువ్వు మరీ దిగులుపడకు.

సూర్యాస్తమయం అవుతోంది. ఆ అందం... ప్రకృతీ దిగులు పుట్టిస్తున్నాయి. అంతలోనే ఏదో చైతన్యాన్ని కలగజేస్తున్నాయి. హేమంత్ ఏదో నిశ్చయించుకున్నవాడిలా నిరంజన్‌ని గాఢంగా కౌగిలించుకున్నాడు. సజలనయనాలు, అన్ని సందేహాలనీ, వింత కోరికలనీ పటాపంచలు చేస్తున్నాయి.

*